క్లుప్తంగా

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



డిచ్‌పల్లి: 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాజేందర్ కోరారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఆయన విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటరుగా పేరు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు వంటి అంశాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో జీరో సర్వీస్ వారికి అవకాశం కల్పించాలి



డిచ్‌పల్లి: నూతనంగా రెగ్యులరైజ్ అయి జీరో సర్వీస్ ఉన్న జూనియర్ లెక్చరర్లకు బదిలీల్లో అవకాశం కల్పించాలని వారు కోరారు. ఈమేరకు బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రవిఠల్‌కు వినతిపత్రం అందజేశారు. లెక్చరర్లు అర్చన, మురళి, ప్రవీణ్, తిరుపతి, సుజాత, స్రవంతి పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి



ఖలీల్‌వాడి: డీఎల్‌డీఏ సంస్థ ఆస్తులను, భూములను కాపాడాలని, పశుగణాభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య పేర్కొన్నారు. కోటగల్లిలోని ఎన్ఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెటర్నరీ కాలేజీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు భూమయ్య, మురళి, శివకుమార్, సాయిబాబా, జేపీ, గంగాధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



డిచ్‌పల్లి: పౌష్టికాహారం (సమతుల ఆహారం) తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి సూచించారు. మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బుజ్జి మాట్లాడుతూ.. ప్రతి సీజన్‌లో లభించే పండ్లు, సమతుల ఆహారం తప్పక తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు నుస్రత్, భాగ్య, అమీనా, ఆయాలు ఉన్నారు.

రక్తదాన శిబిరం



నిజామాబాద్ సిటీ/నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం జరిగింది. శిబిరంలో 60 బ్లడ్ యూనిట్‌లను విద్యార్థుల ద్వారా సేకరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి ప్రసన్నకుమారి, ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'విత్తన బిల్లులు' ఇప్పించాలి

కమ్మర్‌పల్లి: సోయాబీన్ విత్తనాల కొనుగోలు బిల్లులు ఇప్పించాలని మండలంలోని ఉప్లూర్ రైతులు బుధవారం వ్యవసాయాధికారులకు విన్నవించారు. ఖరీఫ్ సీజన్‌లో ఏర్గట్ల మండలం తొర్తి గ్రామానికి చెందిన గంగాధర్ నుంచి విగోర్ 11 కంపెనీ విత్తనాలు కొనుగోలు చేశామని రైతులు తెలిపారు. కానీ గంగాధర్ బిల్లులు ఇవ్వలేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి బిల్లులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు కరువు

- మౌలిక వసతులు అంతంతే!
- ఇబ్బందుల్లో రోగులు
- పట్టించుకోని అధికారులు



సారంగాపూర్ గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఆరోగ్య ఉపకేంద్రం

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలంలోని పలు ఆరోగ్య ఉప కేంద్రాలు, పల్లె దవాఖానాలకు సొంత భవనాలు కరువయ్యాయి. దీంతో తాత్కాలిక భవనాల్లో సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నా.. మౌలిక వసతులు లేకపోవడంతో బాలింతలు, గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని ముదక్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని గుపన్‌పల్లి, సారంగాపూర్, గుండారం గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలు గ్రామ పంచాయతీ భవనాల్లో కొనసాగుతున్నాయి. మాధవనగర్ గ్రామంలోని కమ్యూనిటీ భవన్‌లో ఆరోగ్య ఉపకేంద్రం కొనసాగుతుంది. ఈక్రమంలో ఆయా కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు, సామాన్య ప్రజలకు మౌలిక వసతులు అందుబాటులో లేకుండా పోయాయి. కేంద్రాలకు వచ్చిన వారు తాగునీరు, వాష్‌రూంలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో ఖానాపూర్, తిమ్మన్‌పల్లి గ్రామాలకు బస్తీ దావఖాన, పల్లె దవాఖానాకు శాశ్వత భవనాలు ఉన్నాయి. కానీ ఈ భవనాల్లో ఒక వైపు పంచాయతీ కార్యాలయం, మరోవైపు ఆరోగ్య ఉపకేంద్రం నడిపిస్తున్నారు.

ప్రభుత్వ భూమి లేకనే..

రూరల్ మండలంలోని అన్ని ఉపకేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందినప్పటికీ, కొన్ని ఆరోగ్య ఉప కేంద్రాలకు శాశ్వత భవనాలు లేక ఇబ్బందులకు లోనవుతున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేక నిర్మాణాలు చేపట్టలేకపోతున్నట్లు సమాచారం. గుండారం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం గ్రామ పంచాయతీలో ఉంది. గ్రామంలో నూతనంగా ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆయా ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



సారంగాపూర్ ఆరోగ్య ఉపకేంద్రం గ్రామ పంచాయతీ భవనంలో ఉంది. ఉపకేంద్రానికి శాశ్వతంగా స్థలాన్ని కేటాయించి ప్రభుత్వం భవనాన్ని నిర్మించాలి. ఉప కేంద్రంలో మౌలిక వసతులు కరువయ్యాయి. అధికారులు స్పందించి, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలి.

–అబ్దుల్ మజీద్, సారంగాపూర్

ఉన్నతాధికారులకు నివేదించాం



రూరల్ మండలంలో ఆరోగ్య ఉప కేంద్రాలకు శాశ్వత భవనాలు లేనివాటిని గుర్తించి ప్రపోజల్స్ ఉన్నతాధికారులకు పంపించాం. ఆదేశాలు రాగానే స్థలాలను పరిశీలించి నిర్మాణ పనులు చేపడతాం. గుండారం గ్రామంలో నిలిచిన ఆరోగ్య ఉపకేంద్రం పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

– డా.సుదర్శనం, జిల్లా వైద్యాధికారి

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి





నగరంలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది.. మోపాల్‌లో సమ్మెకు మద్దతు తెలుపుతున్న నేతలు

జక్రాన్‌పల్లి/నిజామాబాద్‌నాగారం/మోపాల్(నిజామాబాద్‌రూరల్): తమను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని అంగన్‌వాడీ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈమేరకు నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వారు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. జక్రాన్‌పల్లిలో అంగన్‌వాడీల సమ్మెకు ఐఎఫ్‌టీయూ నాయకులు మద్దతు తెలిపారు. మోపాల్ మండల కేంద్రంలో చేపట్టిన సమ్మెకు పీసీసీ ప్రధానకార్యదర్శి నగేష్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరికాదని, అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ ఉద్యోగులు పేర్కొన్నారు. ఈమేరకు నగరంలో వారు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సుభాష్‌నగర్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. ఈనెల 20లోపు కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, మెనూ ఛార్జీ రూ.25, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, గుర్తింపు కార్డులు, యూనిఫారం ఇవ్వాలని, లేకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి పి సుధాకర్ మద్దతు తెలియజేశారు. యూనియన్ సభ్యులు సాయమ్మ, చక్రపాణి, ఉషారాణి, రూప, భూమయ్య, నాగలక్ష్మీ, ఉమా పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు



సిరికొండ: మండల కేంద్రంలోని కామధేను జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నృత్యాలతో విద్యార్థులు హోరెత్తించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా పాదయాత్రలో పడకల్ వాసి..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన బోండ్ల కృష్ణ ఈ నెల 5న హరహరపుత్ర అయ్యప్ప సేవా సమితి నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో మహా పాదయాత్రగా శబరిమలకు వెళ్లారు. బుధవారం నాటికి 350కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసుకున్నారు.

స్వర్గయాత్రరథం బహుకరణ



జక్రాన్‌పల్లి: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి స్వర్గరథాన్ని మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్, మునిపల్లి సొసైటీ చైర్మన్ ముస్కు సాయరెడ్డి బుధవారం బహుకరించారు. సర్పంచ్‌లు కై లాస్, సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌కు భూమిపూజ



నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామంలో బుధవారం సర్పంచ్ శేఖర్‌గౌడ్ బస్‌షెల్టర్‌కు భూమి పూజచేశారు. ఎంపీటీసీ శాంతా, సాయిలు, గ్రామ కార్యదర్శి ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంట రుణాల మంజూరు



నిజామాబాద్ రూరల్: మండలంలోని పాల్దా సొసైటీ పరిధిలో రుణమాఫీ అయిన 20 మంది రైతులకు బుధవారం సొసైటీ ఆధ్వర్యంలో రూ.18లక్షల పంట రుణాలు అందించారు. వైస్ చైర్మన్ శ్రీనివాస్, సీఈవో రాకేష్, రైతులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన ఎండీఎం కార్మికులు

ఖలీల్‌వాడి: తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులు తరలివెళ్లారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు, కార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమం పరిశీలన



ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామంలో జరుగుతున్న జాతీయ టీకా కార్యక్రమాన్ని ఇందల్వాయి హెచ్‌ఈవో శంకర్ బుధవారం పరిశీలించారు. నవజాత శిశువులకు సకాలంలో టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు.

సెల్‌ఫోన్ల రికవరీ



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పలువురు బాధితులు సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు సెల్‌ఫోన్లను గుర్తించి, బుధవారం అందజేశారు. ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మల దినోత్సవం



నిజామాబాద్ అర్బన్: నగరంలోని నారాయణ పాఠశాలలో బుధవారం అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల అమ్మమ్మ నాన్నమ్మ, తాతయ్యలు కార్యక్రమంలో పాల్గొని, వారి జీవిత అనుభవాలను అందరితో పంచుకున్నారు. పాఠశాల యాజమాన్యం వారిని సన్మానించింది. స్కూల్ జీఎం గోపాల్‌రెడ్డి, డీజీఎం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మంచిప్ప ఎస్‌బీఐలో సాంకేతిక లోపం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో బుధవారం సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో బ్యాంకులోని ఖాతాదారులు గంటల తరబడి వేచి ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్యాంకులో సర్వర్, సాంకేతిక సమస్యలు తరచూ ఏర్పడుతాయని పలువురు ఖాతాదారులు వాపోయారు.

పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి



డిచ్‌పల్లి: రైతులు పండ్ల తోటల పెంపకం చేపట్టేలా ప్రోత్సహించాలని, ప్రభుత్వ సబ్సిడీ సౌకర్యాలు వివరించాలని ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, ఏవో రాంబాబు సిబ్బందికి సూచించారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలానికి 65ఎకరాలలో పండ్ల తోటలు పెంచే విధంగా అధికారులు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. పండ్ల తోటలు పెంచుకోవడానికి ఆసక్తి గల రైతులను గుర్తించాలన్నారు. ఏపీవో సుధాకర్‌రెడ్డి, ఏఈవోలు భావన, నృపేష్‌కుమార్, సంధ్యరేఖ, వంశీకృష్ణ, అశ్రిత, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాశాల భూములపై విచారణ చేపట్టాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని చిట్టిమిల్ల హరిప్రసాద్ ఆర్యవైశ్య జూనియర్ కళాశాల భూములపై విచారణ చేపట్టాలని టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ ఖాజా ఖుద్బుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే కళాశాల భూములను పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు పరిశీలించారు.

డ్రెయినేజీ నీటిని తొలగించండి



నిజామాబాద్‌నాగారం: నగరంలోని గాయత్రినగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నుంచి నీరు లీకేజీ కావడంతో రోడ్డుపై ప్రవహిస్తోంది. వారం రోజులుగా రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు, స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవడం లేదు. మురుగునీరు పారడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కారించాలని వారు కోరుతున్నారు.

హైమాస్ట్ లైట్ల కోసం వినతి

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని ఉమ్మెడ, బాద్గుణ గ్రామాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుకు వారు వినతి పత్రం అందజేశారు చైర్మన్ సానుకూలంగా స్పందించారు.

ప్రతిపక్షాలవి అమలుకాని వాగ్దానాలు





సిరికొండలో గెస్ట్ హౌజ్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే.. డిచ్‌పల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న బాజిరెడ్డి

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

సిరికొండ: రాబోయే ఎన్నికల కోసం ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సాధ్యం కాని హామీలను అమలు చేస్తామని వాగ్దానం చేస్తున్నారని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన బైపాస్‌రోడ్డు, గెస్ట్‌హౌజ్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభించారు. పలు సంఘాలకు నిధుల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నామన్నారు. సర్పల్లితండాకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

పంచాయతీరాజ్ ఏఈ కార్యాలయం..

ధర్పల్లి: మండల కేంద్రంలో బుధవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఉప కార్య నిర్వాహక ఇంజనీర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బాజిరెడ్డి ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అదనపు గదుల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు.

నిధుల ప్రొసీడింగ్ కాపీల అందజేత

ఇందల్వాయి: మండలంలోని పలు కుల సంఘాల భవన నిర్మాణాలకు బుధవారం నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే అందజేశారు. సర్పంచ్ మమత, ఎంపీటీసీ సరిత, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

చేపల మార్కెట్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన..

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ పక్కన నిర్మించనున్న చేపల మార్కెట్ భవన నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం పరిశీలించారు. నేడు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ కవితతో మార్కెట్ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ డ్రైవర్లతో అధికారుల చర్చలు సఫలం



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య డ్రైవర్ల సమస్యలపై బుధవారం కార్మిక సంఘాలు, మున్సిపల్ కమిషనర్ జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల గోవర్ధన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం పెంచిన వెయ్యి రూపాయలను చెల్లించడానికి సీడీఎం ఏ అనుమతి కోరుతూ కమిషనర్ లేఖ రాస్తానని హామీ ఇచ్చారన్నారు. అలాగే డ్రైవర్ల సమస్యలను, డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామన్నారని తెలిపారు. నాయకులు భూపతి, ఏక్‌నాథ్, లక్ష్మణ్, సంతోష్ గౌడ్, మారుతి, నవీన్, వినోద్, రవి కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా శివపార్వతుల కళ్యాణం



నిజామాబాద్ సిటీ: నగరంలోని శంభులింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రావణమాసం మాస శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఏలేటి పశుపతిశర్మ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు ఇష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని డీఐఈవో రఘురాజ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు నర్సయ్య, చిన్నయ్య, అధ్యాపకులు, స్వర్ణ, రవి, చంద్రశేఖర్, నరేశ్, సుభాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,700	వెండి (కిలో)	76,000
22 క్యారెట్స్	56,147	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	5	10	గాజరుగడ్డ	40	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	30	50	దోసకాయ	25	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	20	40
జిర్నికాయ	30	50	గోబిగడ్డ	18	40
కాకరకాయ	25	50	గోబిపువ్వు	25	50
వంకాయ	25	50	బీట్‌రూట్	35	60
పాలకూర	30	50	కరివేపాకు	40	60
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	35	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	70	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	25	50			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	జవాన్(తెలుగు)- 1.10
	జవాన్(హిందీ)- 4.10,7.20,10.30
స్క్రీన్-2	ఖుషి(తెలుగు)- 10.20 ,4.20,10.30
	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి(తెలుగు)-1.25,7.30
స్క్రీన్-3	జవాన్(తెలుగు)- 10.15, 4.30,7.35, 10.35
	జవాన్(హిందీ)- 1.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	జవాన్(హిందీ)- 11.30,3.05,6.40, 10.15
స్క్రీన్-2	జవాన్(హిందీ)-10.30,5.40,9.15
	జవాన్(తెలుగు)-2.05
స్క్రీన్-3	జవాన్(తెలుగు)- 11.05
	ఖుషి(తెలుగు)- 2.40,6.05
	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి 9.30
స్క్రీన్-4	జవాన్(హిందీ)- 9.45
	ది నన్-2(ఇంగ్లీష్)- 1.50,7.35
	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి 4.25
	ఖుషి -10.10
దేవి	ఖుషి
నటరాజ్	జవాన్(హిందీ)
లలితామహల్	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
విజయ్	జవాన్(తెలుగు)